
# పేగు తెగిన చప్పుడు...

పగడాల నాగేందర్



చదువుతున్న మాటేగాని, పుస్తకం తలకెక్కట్లేదు. బలవంతంగా చదవడం, బలవంతంగా బతకడం ఎప్పుడో అలవాటయిపోయింది. ఇదమిద్ధంగా ఎప్పుడూ... అనుకుంటే సరిగ్గా గుర్తులేదు. పరధ్యానంగా సాగుతున్న ఆలోచనను భగ్నంచేస్తూ కరెంటు పోయింది. చుట్టూ చీకటి... కిటికీలోంచి బయటికి చూసాను. గాఢమైన చీకటి. సిగరెట్ పెట్టె చేతికి తగిలింది. సిగరెట్ నోట్లో పెట్టుకొని అగ్గిపెట్టె చేతిలోకి తీసుకొని, పుల్ల వెలిగించాను. చుట్టూ గాఢంగా అలుముకున్న నల్లని చీకటి, పుల్లవెలుగులో మంట... చిన్న మంట... బహుశా ఈరోజు అమావాసేమో...!

ఏమో అమావాసేనేమో...! లేకపోతే నా మదిలో వేదనలా ఇంత దట్టమైన చీకటుండదు. ఆ రోజు కూడా అమావాసే...! నాకింకా బాగా గుర్తుంది. భయంకరమైన నల్లని చీకటి. స్మశానంలో ఏ చితి కాలట్లేదు. ఎక్కడా మంటలేదు. ఎవరి చేతిలోనో వెలిగే పెట్రోమాక్స్‌లైట్. భుజం మీద చెయ్యేసి దగ్గరగా పొదువుకుంటూ... నా చేతికి బాబాయి కాగడా యిచ్చాడు. పెళ్లినాటి పట్టుచీరలో చుట్టబడి, చిక్కిశల్యమైన అమ్మ బొమికల గూడు దేహం.., బోర్లా పడవేసి వుంది. ఆ చీరంటే నాకెందుకో చిన్నప్పట్నుంచి చాలా యిష్టం. పింక్ కలర్ చీరకు చిలకపచ్చ బార్డర్. అదే చిలకపచ్చ రంగులో మెరిసే పైటకొంగు. అమ్మ పండుగల రోజులలో ఆ చీర కట్టేది. నాకింకా బాగా గుర్తు. బతుకమ్మ పండుగ రోజు... చేతిలో బతుకమ్మతో... అమ్మ ఆ చీరలో... ఆ కొంగుతో ఎంతగా ఆడుకునే వాణ్ణో! విసుక్కుంటూ... కసురుకుంటూ... లాలిస్తూ... అమ్మ ఆ పైటకొంగుతో ఎన్నిసార్లు అక్కున చేర్చుకుందో! ఆ మాధుర్యం... చవిచూసిన ఆనాటి మాధుర్యం ఎంత తలచుకున్నా గుర్తురాదేమి? ఇప్పుడంతా అయోమయం. ఇప్పుడు ఏ స్పర్శలోనూ, ఆ పైటను మోమునిండా చుట్టుకొని మైమరచిన ఆ రోజుల మాధుర్యాన్ని చూడలేకపోతున్నానేం? ఆ చీరకు..., ఆ పైటకొంగుకే ఆ రోజు... చీకట్లో స్మశానంలో కొరివంటించాను. భగ్గుమన్న మంటలు... బుసలుకొట్టే మంటలు... సవాల్ చేసే మంటలు. నన్నెవరో లాక్కెళుతున్నారు, కాస్తా దూరంగా ఆ స్మశాన వాటికలో... అక్కడొక గది. స్నానం చేయమన్నారు. మళ్లీ స్నానం... అర్ధరాత్రి చలి... గుండెల్లో మంటలు... చితిలో మంటలు... చుట్టూ చీకటి; స్నానం ఆలస్యం చేస్తూ... ఆ మంటల్ని నిర్వికారుడిలా చూసాను. వేదనతో... కసితో... కోపంతో, ఆ మంటల్నే చూస్తున్నాను. పెనుచీకట్లను చీలుస్తూ... ఆకాశంలోకి నాల్కలు సాచి బుసలు కొడుతూ మంటలు... రారమ్మని సవాల్ చేస్తూ... మంటలు; చందమామ కథల్లోలా నేను రాక్షసుణ్ణయితే బావుణ్ణు... ఆ మంటల్ని చేతిలోకి తీసుకొని నలిపేసే వాడిని! అసహనం, ముప్పిరిగొన్న ఆవేశం... దవడల కింద నలుగుతున్న సమాజాలు... తరాల, యుగాల స్మశానాల్లోంచి వేడివేడి నిప్పుకణికల సెగలు... కాలుతున్న మంటల్లోంచి... రారమ్మని బలహీనంగా రెండు చేతులు- కావలించుకొని బావురుమన్నాయి. వేలవేల యుగాలుగా గడ్డకట్టబడ్డ, కోట్లాది మనుషుల వేదన- కరిగి నీరవుతున్నా, నేనెందుకు తడవలేకపోతున్నా!

ఎక్కడో ఏదో జరిగింది. ఎక్కడో నాకు తెలియకుండానే తీగ తెగింది. లేక జ్ఞాపకం లేదో ఏమో! తెగిన శబ్దమన్నా వినలేని యాంత్రికతలోకి నన్నెవరో నెట్టేస్తున్నారు. ఏమో! ఏదీ అంతుబట్టదు. లేకుంటే- నాలో ఎన్ని జ్ఞాపకాలు, పొద్దుటి పూట గడ్డిపై పరుచుకున్న మంచు బిందువుల్లా, పేటిక తెరిస్తే ఇప్పటికీ తళుక్కుమంటాయి. పక్షులన్నీ గూళ్ళకు చేరే శబ్దాల మధ్య, పచ్చని చెట్టుకింది వీధి అరుగుపై అమ్మ చేతిలోని వేడివేడి గోరుముద్దల మామిడి పచ్చడి వాసన, ఇప్పటికీ ఎన్నిసార్లు కలవరపెడుతుంది. క్యాంపస్‌లో తిండితినని రోజు- కడుపులోకి కాళ్ళు ముడుచుకొని పడుకుంటేనో, పట్నపు హోటళ్ళ వ్యాపార పళ్ళాల్లో అన్నం రుచి మరిచిపోతేనో, అదే జ్ఞాపకం. మా అమ్మ లాగే- మా ఊరు, ఆ బాల్యం, నా కంటినీరులో ఎన్నిసార్లు జ్ఞాపకాలుగా కరిగిపోయిందో! ఎన్నిసార్లు దేహం నిండా సెగలై రగులుకుందో! నేను, జహంగీర్, గోపి, వీరయ్య తాటిపండ్లు కాల్చుకోడానికి- భయభయంగా, ఆ సాయంత్రం స్మశానపు చితిలోంచి తీసుకొచ్చిన నిప్పు- ఇప్పటికీ నిద్రలో పీడకలై వెంటాడుతోంది. ఎర్రటి ఎండలో నీళ్ళలోకి దూసుకుపోయిన ఆ శరీరపు హాయి, బావుల్లో తగిలిన దెబ్బలు, ఇప్పటికీ రాత్రులు దారిదొరకని కలవరింతల్లో పాడుబడ్డ బావుల్లా వచ్చి, భయకంపితుణ్ణి చేసిపోతుంటాయి. నిద్రపట్టని నడిరాత్రుల్లో- చుట్టూ వున్న చీకటిని భీతిగా తడుముకుంటే... మంటల మధ్యనుంచి రారమ్మని అవే బలహీనమైన చేతులు. దీర్ఘరోగిలా నిత్యం ధ్వనించే ఈ మనసు మూలుగులను ఎవరు వినగలరు?

మెడచుట్టూ చేతులేసి, అమ్మ భుజాలపై కోలాడుతూ... ప్రపంచంలోని ఆనందాన్నంతా తన ఆటలోనే పలికించే ఏ పసిబిడ్డను చూసినా మనసు అలా నిలబడిపోతుంది. దృశ్యం మాత్రమే శాశ్వతమనుకుంటాను. ఆ ఆనందంపై ఏ అమావాస్య నీడ పడుతుందోనని, భయభయంగా... దు:ఖదు:ఖంగా... వెంటాడే వేదన. నిరంతర వేదన. వేదన మీద ముసుగేసుకొని, సెగలతో రగిలే దేహంపై నీట్‌గా దుస్తులేసుకొని, కాలేజీకెళుతుంటాను. బజారుకెళుతుంటాను... ఎక్కడెక్కడికో... ఎక్కడెక్కడికో... వెళుతుంటాను. అయినా మనసు రెటీనాపై నిత్యం అదే దృశ్యం. ఆ చీకటి గదిలో మంచం మీద పడుకొని, "ఎంకన్నా... ఎంకన్నా!... నన్ను బతికించురా! కొడుకా! నాకప్పుడే చచ్చిపోవాలని లేదురా!" అంటూ పెనవేసుకొని బావురుమన్న అమ్మ బొమికల గూడు దేహం. పెనవేసుకొని భోరుమన్న అమ్మకు ఏమివ్వగలిగాను? నిస్సహాయమైన ఏడుపును తప్ప! ఆ బీభత్స దు:ఖంలోనూ... అమ్మే ముందుగా తెప్పరిల్లి, అగాథంలోకి జారిపోతూ... ఆఖరిసారిగా బిడ్డను చూసుకుంటున్నట్లు కళ్ళలోకి చూసింది. ఇప్పటికీ గుండెల్లో బాకై దిగిన ఆ చూపు కలవరపెడుతూనే వుంది. బిడ్డను విడవలేక, పులి దగ్గరికెళుతున్న ఆవులా... ఆ రోజు మాటలు... "ఏడ్వకు... ఏడ్వకురా!... మంచిగ బతుకు నాయనా! అందరి చేత ఫలానోళ్ళ పిల్లలంటే మంచోళ్ళు... అన్పించుకోరా..." అంత దు:ఖంలో బాగుకోరుకునే అమ్మ బలహీనమైన ఆ చేతుల్లో ఎంత ఆప్యాయత. ఆఖరిసారిగా అటుతిప్పిన అమ్మ ముఖం మీద, ఆరిన కళ్ళలోని వెలుగు కన్నీటి మీద... నేనున్నానంటూ జీరగా పరుచుకుంది, ఆ చీకటిపొరనే! సెలవుల్లో యింటికొస్తే, అమ్మ కళ్ళనిండా సంతోష రేఖలతోనే మా వొంటిని తడిమేది. ఆ కళ్ళలోని సంతోషమేది? పండుగ దినాల్లో అద్దం ముందు అమ్మ దిద్దుకునే కళ్ళకాటుక రేఖల్లో- ఆ మెరుపేది? ఆఖరిగా ప్రవహించినవి ఆ కళ్ళనుంచి కటిక చీకటి రేఖలే! బేలగా వొరిగిన అమ్మ మోమును కావలించుకొని ఏడ్చినపుడు



నా కళ్ళంట కారినవి వెచ్చవెచ్చని కన్నీటి ధారలే!

కదులుతున్న అమ్మపాడె... ముందు నేను... కళ్ళనిండా నీళ్ళు... దారి కనిపించటం లేదు. అమాస చీకట్లో... ఆ అర్థరాత్రి పెట్రోమాక్స్ లైట్ వెలుగులో... ఆగిన నా పాదాలు. చేతిలో సెగలు కక్కుతున్న తలకొరివి కుండ. పగులుతున్న అమ్మగాజుల చప్పుడు. ఊహ తెలిసిన రోజుల నుంచి... అమ్మ పక్కన పడుకొని... అర్ధరూపాయి మిఠాయి కోసమో... అయిదు రూపాయల సినిమా కోసమో..., ఆ గాజుల్ని సవరిస్తూ... గారాలుపోతూ... ఎన్నిసార్లు అమ్మను కాకాపట్టానో! ఎన్నిసార్లు ఆ గాజుల చేతుల ఆప్యాయత బిగింపుల్లో ముద్దుచేయబడ్డానో! ప్రేమగా విసుక్కునే ఆ చేతుల్లో ఎన్ని జన్మల అనురాగమో! "పొత్తినా పగలని గాజులు కాబోలు... రాయి దొరకని... ఆ మసక చీకటి సమయంలో కూడా... అలవాటయిన నాన్న పురుషాహంకారపు విసుగు, కసురుకుంటున్న కోపపు మాటలు... ఇవాళ కొత్తేమి కాదు. పితృస్వామిక భావజాలాల్లోంచి పుట్టిన నాన్నలు, మలచబడ్డ నాన్నలు, తమ సుఖాలకు, చేతగానితనాలకు- కుటుంబాలను బలిచేయడం కొత్తేమి కాదు". నాన్నల అకారణ కోపాల్లోంచి, విసుగుల్లోంచి, మూర్ఖత్వాల్లోంచి- అమ్మలు, చీకట్లోకి నెట్టబడతారు కాబోలు!!

స్మశానాల్లోకి, చితుల్లోకి, రోగాల లోయల్లోకి బేఫికర్‌గా నెట్టి... చేతులు దులుపుకునే పురుష ప్రపంచమమ్మా, ఇది! వెళ్ళ వెళ్ళ...! జో... కొట్టే ఊయల తొట్టిలో గలగలలాడిన గాజుల శబ్దాల్లోంచి..., గొంతెత్తి పాడిన లాలిపాటల్లోంచి..., ఎదుగుతున్న ప్రతిరోజు- పెన వేసుకొని ప్రేమించిన నుదుటి ముద్దుల్లోంచి... జాగ్రత్తగా వినలేదుగాని, అమ్మా! నీ గుండె నిండా నిప్పులేనే! నీ బతుకు నిండా నల్లని చీకటి ధారలేనే! ఇప్పుడీ శవయాత్రలు చీకట్లోనైతేనేం...?!

పడిన బాధలన్నీ చాలిక, మరిక ఏ కష్టమూ పడకుండా ఈ చితిలో కాలిపోవే! మసికావే! నాకు కసిగా చూడాలని వుంది. నోరెత్తిన ప్రతిసారి... ఆడదానివంటూ గడపలోకే నెట్టిన, ఈ లోకం మీద..., కాలుతున్న నీ పొత్తికడుపులోని క్యాన్సర్ మురికిని కసిగా చిమ్మి, అమ్మా! కదిలిపోవే! కోట్లాది నాన్నల అహంకారాల మీద, మూర్ఖత్వాల మీద, అసహ్యంతో 'తెల్లబట్ట'ను ఉమ్మి, కాలిపోవే! సర్వనాశనమైన నీ బతుకు సాక్షిగా- మసైపోవే! కడుపులో కదిలిన స్వంత ప్రాణాలే!, వెన్నెల నవ్వుల్లోకి దారులై సాగాల్సింది పోయి..., నీ కడుపులో కంతులకి కారణమయ్యారే! ఒక్కసారి... పొట్టగిన్నెల్లో తాపిన ఉగ్గుపాలు మరచి, అద్దాల బిడ్డలుగా వున్నప్పుడు చేసిన ఊడిగాలు మరిచి అసహ్యించుకుంది నీ కన్నబిడ్డలేనే! మరోసారి... బహిష్టుస్రావపు నెత్తుటి మరకల్లో బెంబేలుపడి, గడ్డపారతో పెకిలించే పొత్తికడుపు నొప్పుల్లో నీ బాధను చూసి, ఏం చేయాలో పాలుపోక నిస్సహాయంగా కన్నీరు రాల్చింది నీ కన్నబిడ్డలేనే! ఆ రాత్రి... నొప్పి భరించలేక నువ్వు ఉరిబోసుకోబోయినప్పుడు,



**ఊరికే చూస్తూ ఉండలేక, ఏ నిజమూ పెదవి దాటించలేక, తడబడే నా మనసు తొక్కిసలాటలో నువ్వు పోల్చుకుంది మృత్యుఛాయలేనే అమ్మా!**

నిశ్చేష్టులై నిలిచింది నీ కడుపు తీపి బంధాలేనే! ఊపిరిపోయిన క్షణం... చల్లారిన నీ శోకాగ్నిని చూసి అశ్రుధారలతో నీ శవాన్ని తడిపింది, భూమిపై మిగిలిన నీ పేగులేనే! ఎన్ని జన్మాల బంధాలే తల్లీ ఇవి! నిద్రలో కూడా కలవరపెడుతూ... వెంటాడుతూ... ఆఖరిగా... నీ ముఖంలోని మూగబాధతో..., నీ బిడ్డల మనసుల్లో ముసురుకున్న చీకటి ధారలతో చేతులు కలిపింది, పితృస్వామ్యపు నెత్తుటి మంటలేనే!

చీకటిలో దృశ్యాన్ని స్పష్టంగా పోల్చుకోలేం! శత్రునీడల్ని అసలే పోల్చుకోలేం! అజ్ఞానపు చీకటే అంతటా అలుముకున్నప్పుడు- అన్నీ మన కర్మలే! నుదుటి రాతలే! ఓదార్పు గీతాలన్నీ చిమ్మచీకటి ముందు వెలవెలబోయిన వెన్నెలలే! యుగాలుగా, వేల సంవత్సరాలుగా ఖననం కాబడ్డ, కోట్లాది స్త్రీల శరీరాల పాలిన సమాధుల్లోంచి వినబడేదంతా మూగబాధల ఘోషనే! అవునే అమ్మా! ఇదంతా నిన్ను కబళించిన చీకటే! ఇప్పుడిక చీకట్లో కూడా పోల్చుకోగలిగే దృశ్యాలకి మనసు చెదరకా తప్పదు! గుండె కరుగకా తప్పదు!

నిజాల్ని చూడలేని కళ్ళకింద కారుచీకటి ధారలే! సృష్టికార్యం చీకటి గదుల్లో కదా, గుండెనిండా భయాలేనే అమ్మా! సున్నిత మనసు పొరల్లో చీకటి ధారలే!

మృత్యువుతో ముడిపడ్డ బంధాల్లోంచి, ఎగిసే బాధల నిండా ఒంటిని దహించే మంటలే! చచ్చినా, జాలి చూపుల్ని చితిమంటలపై తచ్చాడించలేని కుసంస్కారపు లోకమేనమ్మా, నిన్ను నిస్సిగ్గుగా నిందించింది. "చేసిన పాపాలు ఊరికే పోతాయా? భోగపు కులాలోళ్ళకే ఇలాంటి రోగాలొస్తాయి?" అంటూ, గుండెల్ని నిలువునా చీల్చే మాటల ఈటెలే అంతటా! కాలుతున్న కమురు వాసనల స్మశానపు కంపులే అంతటా! ఊడుకుతున్న రక్తానికెరుక నా క్షోభేంటో!? ఆనాడు డాక్టరిక బతకవని చెప్పిన రోజు, ఆ ఆటోలో చీకటి నీడలో బితుకు బితుకుమని కూర్చున్నప్పుడు, నీ కన్నుల్లో నాకు వినిపించినవి- ఉప్పెనై పొంగిన దు:ఖపు కేకలే! ఇప్పటికీ గుండెల్ని మెలిపెడుతూ, నిద్రలో- కలవరింతల్లో, తుళ్ళిపడే భయంలో నిరంతరం వెంటాడేవి, ఆ మౌన శోకపు కేకలే! ఊరికే చూస్తూ ఉండలేక, ఏ నిజమూ పెదవి దాటించలేక, తడబడే నా మనసు తొక్కిసలాటలో నువ్వు పోల్చుకుంది మృత్యుఛాయలేనే అమ్మా! పరుచుకున్న నా జీవితపు పొలిమేరల దాకా బాధనంతా చిమ్మి, భూగోళపుటంచులదాకా, బొడ్డుపేగు తెగ్గోసిన నెత్తురంతా జల్లి, నీవు వెళ్ళిపోవచ్చునే అమ్మా! ఈ భూగోళం పేలిపోయినా, సృష్టి శూన్యమైనా- నీకూ, నాకూ మధ్య జరిగే నిరంతర మౌన సంభాషణలో మాత్రం మొలకెత్తేది, తిరిగిరాని గతపు ప్రేమనీడలే! వాటి నిండా ఎగిసిపడే లేలేత మంటలే! ఆ మంటల నీడల్లో కదలాడేవి చీకటి ధారలేఅమ్మా!

కారునల్లని చీకటి ధారలే!! ●

## పిల్లల ఆరోగ్యాన్ని పట్టించుకుంటున్నారా?



మీ పిల్లలు అందంగా, ఆనందంగా ఉండాలంటే వారి ఆరోగ్యం బాగుండాలి. కనుక వారి ఆరోగ్యం పట్ల సదా జాగ్రత్తగా ఉండాలి. ఎలా అంటారా?

* పిల్లలను కనీసం మూణ్నెల్లకోసారైనా డాక్టర్‌తో చెకప్ చేయించాలి. ఏ సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.
* వారికి టీకాలు ఇప్పించడంలో డేట్స్‌ను సరిగా పాటించాలి.
* పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు అలవాటు చేయకూడదు.
* కాఫీలు, టీలు తాపించే అలవాటు మంచిది కాదు. ఉదయం, సాయంత్రం పాలు తాగే అలవాటు చేయండి.
* పిల్లల తిండి విషయంలో క్రమశిక్షణతో వ్యవహరిస్తే చాలావరకు ఆరోగ్యం కుదురుగా ఉంటుంది. కనుక పిల్లల డైట్ చక్కగా ఉండేలా ప్లాన్ చేసుకోండి.
* ఫ్రూట్స్ తినే అలవాటు చేయడం మంచిది.
* కొందరు పిల్లలు సీజన్ మారిన ప్రతిసారి ఆరోగ్య సమస్యలకు లోనవుతారు. ఇది క్రానికల్‌గా ఉంటే మాత్రం మంచి పిల్లల వైద్యుణ్ణి సంప్రదించాలి.
* పిల్లలకు బయటి తిండి అలవాటు చేయకండి. ఎక్కడపడితే అక్కడ నీళ్ళు తాగే అలవాటు మంచిది కాదు. మీరు బయటికి వెళ్ళినప్పుడు మీతోపాటు వాటర్ బాటిల్ తీసుకెళ్ళండి. ఇలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరిస్తే పిల్లలు ఆరోగ్యంగా, అందంగా ఉంటారు.